నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 23 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

దహెగాం : బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్సీ దండె విఠల్

కేసీఆర్ చేసిన అభివృద్ధే బీఆర్ఎస్‌ను గెలిపిస్తుంది

● ఎమ్మెల్సీ దండె విఠల్ ● బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

పెంచికల్ పేట్, ఏప్రిల్ 22 : కేసీఆర్ పదేళ్ల పాలనలో చేపట్టిన పథకాలు, అభివృద్ధే ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపిస్తాయని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ, సిర్పూర్ పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి దండె విఠల్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో లోడ్పల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరగా, ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రైతులు కంటతడిపెట్టిన రోజు లేదని, కాంగ్రెస్ వచ్చిన నాలుగు నెలల్లోనే రైతులు తాగు, సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి రైతుబంధు అందించడంలో విఫలమయ్యారని, ఓటుతో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వంలో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకుడు బిట్టు శ్రీనివాస్, లోడ్పల్లికి చెందిన అలిశెట్టి రాజన్న, గంగన్న, నగేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

50 మంది చేరిక..

దహెగాం, ఏప్రిల్ 22 : మండల కేంద్రంతో పాటు మొట్లగూడ,రాంపూర్,దిగడ గ్రామాల్లో ఎమ్మెల్సీ దండె విఠల్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీతో పాటు వివిధ పార్టీల నుంచి 50 మంది బీఆర్ఎస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు శాకీర్, ఎల్కరి ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు చెన్నూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రచారం

చెన్నూర్/మందమర్రి, ఏప్రిల్ 22 : చెన్నూర్ నియోజకవర్గంలో పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు మందమర్రి డివిజన్‌లోని కేకే-5 బొగ్గుగనిని సందర్శించనున్నారు. 8 గంటలకు పాల చెట్టు ఏరియాలోని శ్రీపంచముఖీ హనుమాన్ ఆలయంలో ప్రత్యక పూజలు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటలకు యాపల్ ఏరియాలో ప్రచారం నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు క్యాతన్‌పల్లిలోని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నివాసం వద్ద నియోజవర్గ స్థాయి యువజన, విద్యార్థి, సోషల్ మీడియా వారియర్స్‌తో సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు చెన్నూర్ పట్టణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం పట్టణంలోని ప్రధాన రహదారిలో ఎన్నికల ప్రచారం చేస్తారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రచార కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మందమర్రి పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్ తెలిపారు.

మంచిర్యాల ఎమ్మెల్యేపై కేసు

● 'కాంగ్రెసోళ్లకు కోడ్ వర్తించదా?' కథనంపై ఫ్లయింగ్ స్క్వాడ్ సీరియస్

● ఈద్గాలో ప్రచారాన్ని సుమోటోగా తీసుకొని పీఎస్సార్‌పై కేసు

మంచిర్యాల, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నికల ప్రవర్తనా నియామవళిని ఉల్లంఘించిన కాంగ్రెస్ నాయకులపై అధికారులకు కేసులు నమోదు చేస్తున్నారు. శ్రీరామనవమి రోజున ఓ గుడికి వెళ్లిన మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రూ.లక్ష విరాళం ఇచ్చిన ఘటనలో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా, అంతకు ముందు రంజాన్ పర్వదినాన ఎమ్మెల్యే పీఎస్సార్ ఈద్గాలోకి వెళ్లి మాట్లాడగా, 'నమస్తే తెలంగాణ'లో 'కాంగ్రెసోళ్లకు ఎన్నికల కోడ్ వర్తించదా?' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిని సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేసిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ప్రజాప్రతినిధులు గుడులు, మసీదులు, చర్చిల్లో ఎలాంటి ప్రసంగాలు చేయకూడదు. కానీ పీఎస్సార్ దీన్ని ఉల్లంఘిస్తూ ఏప్రిల్ 11న మంచిర్యాల ఆండాలమ్మ కాలనీలోగల ఈద్గాలో మాట్లాడడంతో పాటు తన ప్రసంగంలో కాంగ్రెస్ పార్టీ అనే పేరును వాడారు. ఇది మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) ఉల్లంఘన కిందకు వస్తుంది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ.. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మంచిర్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనం క్లిపింగ్‌తో పాటు వీడియోలను వారికి అందజేశారు. ఈ మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనుమతుల్లేకుండా షెడ్లు

● సర్వే నంబర్ 199లో గుట్టుచప్పుడు కాకుండా నిర్మాణం

● మున్సిపల్ అధికారులు నోటీసులిచ్చినా పట్టించుకోని వైనం

షెడ్లు బయటికి కనబడకుండా అడ్డంగా పెట్టిన రేకులు

మంచిర్యాల, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల మున్సిపాలిటీల్లో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. పట్టణంలో ఏ గల్లీకి వెళ్లినా సెట్ బ్యాక్ తీసుకోకుండా కట్టే భవంతులు కోకొల్లలుగా కనిపిస్తున్నాయి. ఈ విషయమై అధికారులను అడిగితే 'పొలిటికల్ ఒత్తిడి అండీ.. దయచేసి ఈ విషయాన్ని పబ్లిష్ చేయకండీ' అంటూ చెప్పుకొస్తున్నారు. మంచిర్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డులో సర్వే 199లో ఓ వ్యక్తి మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకోకుండానే షెడ్లు నిర్మిస్తున్నాడు. నిత్యం రద్దీగా ఉండే బైపాస్ రోడ్డులో గుట్టుచప్పుడు కాకుండా పెద్ద పెద్ద రేకులు అడ్డంగా పెట్టి లోపల నిర్మాణాలు చేస్తున్నాడు. ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే అధికారులు అనుమతులు తీసుకోవాలని నోటీసులు ఇచ్చినా పట్టించుకోవడం లేదని తెలిసింది. అలాంటి వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మిన్నకుండిపోవడానికి వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మరి ఇప్పటికైనా అధికారులు ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారా.. లేదా.. అనేది వేచి చూడాల్సి ఉంది.

అనుమతులు తీసుకోకుండా కడుతున్న షెడ్లు

అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ సంతోష్, సీపీ శ్రీనివాస్

● రాపనపల్లిల్లో అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్‌ను తనిఖీ

రాపనపల్లి సమీపంలోని అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్, సీపీ

కోటపల్లి, ఏప్రిల్ 22 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసు, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్, రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం రాపనపల్లి సమీపంలోని అంతర్రాష్ట్ర చెక్ పోస్టును వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. డబ్బు, మద్యం, బంగారం అక్రమంగా తరలిస్తే పట్టుకోవాలని సూచించారు. అనంతరం రిజిస్టర్‌ను పరిశీలించారు. మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ ప్రకాశ్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, శ్రీరాంపూర్ సీఐ మోహన్, చెన్నూర్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్, భీమారం ఎస్ఐ రాములు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

వెంకట్రావుపేటలో ప్రచారం నిర్వహిస్తున్న పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

శ్రీరాంపూర్ ఆర్కే 7 గనిపై కార్మికులతో కలిసి టబ్బులు ముందుకు నెడుతున్న ఈశ్వర్

శ్రీరాంపూర్ ఆర్కే 6 గుడిసెల్లో ప్రచారం చేస్తూ..

కార్పొరేట్ ఓనరుకు కార్మికుల కష్టాలేం తెలుసు

ఎంపీగా గెలిపిస్తే కార్మికుల గొంతుకనవుతా

● సింగరేణిలో ఐటీ రద్దుకు కృషి చేస్తా ● ఇళ్ల స్థలాలకు పట్టాలు, 20 వేల ఉద్యోగాలిచ్చిన ఘనత కేసీఆర్‌దే ● మోసపూరిత హామీలిచ్చిన కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పండి

● పెద్దపల్లి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ● మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి పలుచోట్ల విస్తృత ప్రచారం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 22 : ''సింగరేణిలో 26 ఏళ్లు పనిచేసిన. కార్మికుల ఇబ్బందులు కళ్లారా చూసిన. కార్పొరేట్ సంస్థ యజమానికి (కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ) కార్మికుల కష్టాలు ఏం తెలుసు' అని పెద్దపల్లి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఆర్కే-7, ఆర్కే-7ఏ గనులపై మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, టీబీజీకేఎస్ కేంద్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డితో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గనులపై కార్మికులతో కలిసి బొగ్గు టబ్బులను ముందుకు నెట్టారు. డిపార్ట్‌మెంటుల వారీగా కార్మికులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ గనులపై తిరుగుతుంటే కార్మికునిగా పనిచేసిన రోజులు గుర్తుకు వస్తున్నాయన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే పార్లమెంటులో కార్మికుల గొంతుకనవుతానని చెప్పారు. పార్లమెంటులో బొగ్గుగని కార్మికుల ఐటీ రద్దుకు కృషి చేస్తానని తెలిపారు. కార్మికులు అనేక హక్కులు కల్పించిన కేసీఆర్‌పై నమ్మకం, విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. సింగరేణిలో 20 వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పించిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ కేంద్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బండి రమేశ్, పానగంటి సత్తయ్య, తొంగల రమేశ్, పుప్పాల సంపత్, రాజునాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి మేరుగు పవన్, మాజీ జడ్పీటీసీ తిప్పని రామయ్య, మాజీ సర్పంచులు జగ్గయ్య, టీబీజీకేఎస్ నాయకులు కౌన్సిలర్ వంగ తిరుపతి, బేర సత్యనారాయణ, జనార్దన్, నాయకులు అన్వేష్‌రెడ్డి, గర్సె రామస్వామి, రఫీఖ్‌ఖాన్, గాజం ఎల్లయ్య, బండి తిరుపతి, రవి గౌడ్, పొగాకు రమేశ్, పెద్దపల్లి రామయ్య పాల్గొన్నారు.

ఓటు ద్వారా కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పెద్దపల్లి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఆర్కే-6 గుడిసెలు, గాంధీనగర్, వాటర్ ట్యాంక్ ఏరియాల్లో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి ప్రచారం చేశారు. 16, 17 వార్డుల్లో మాజీ సర్పంచ్‌లు గుంట జగ్గయ్య, రఫీఖ్‌ఖాన్‌లతో కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి స్థలాల్లో నివాసముంటున్న వారందరికీ కేసీఆర్ పట్టాలిచ్చారని గుర్తు చేశారు. కేసీఆర్‌పై ఉన్న విశ్వాసంతో ప్రజలంతా కారుగుర్తుకే ఓటు వేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో నస్పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఈసంపెల్లి ప్రభాకర్, నాయకులు బండి రమేశ్, పానగంటి సత్తయ్య, తొంగల రమేశ్, పుప్పాల సంపత్, నాయజనార్దన్, నాయకులు గర్సె రామస్వామి, గాజం ఎల్లయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించాల్సిన బాధ్యత ప్రజలదే

లక్షెట్టిపేట, ఏప్రిల్ 22 : బీఆర్ఎస్ పాలనలో ప్రజలంతా క్షేమంగా, సంతోషంగా ఉన్నారని, మళ్లీ అలాంటి రోజులు రావాలంటే కారు గుర్తుకు ఓటేసి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం సాయంత్రం వెంకట్రావుపేట గ్రామంలో మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించి ప్రగతి పథంలో నడిపించారని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపిస్తే అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు అంకతి గంగాధర్, ఎంపీటీసీ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓట్లడిగే హక్కు లేదు

● హామీల అమలులో విఫలమైన ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలి

● వ్యవసాయాన్ని సర్వం నాశనం చేసింది సీఎం రేవంతే ● వీకెండ్ లీడర్ వంశీని చిత్తుగా ఓడించాలి

● బీఆర్ఎస్ గెలిస్తే తెలంగాణ హక్కుల కోసం కొట్లాడొచ్చు ● పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

● నస్పూర్‌లో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి ప్రచారం

సీసీసీకార్నర్ ఆటోస్టాండ్ వద్ద ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 22 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలను ఓట్లడిగే నైతిక హక్కు లేదని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పులు ఈశ్వర్ పేర్కొన్నారు. సోమవారం సీసీసీ నస్పూర్‌లో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సీసీసీ కార్నర్ ప్రాంతంలోని వ్యాపార సముదాయాల్లో పర్యటించి, కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆటోడ్రైవర్లను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం తీసుకొచ్చి తమ పొట్టకొట్టిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్లు పెంచుతామమని, కల్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని, మహిళల జీవనభృతి రూ.2500 అందిస్తామని మాట తప్పారని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ సర్కారు వ్యవసాయాన్ని పండుగలా మార్చితే.. రేవంత్‌రెడ్డి వచ్చి సర్వనాశనం చేశారని మండిపడ్డారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో 4 రిజర్వేషన్ స్థానాలుంటే మూడింటినీ గడ్డం ఫ్యామిలీకి కేటాయించారంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ అధిష్టానం డబ్బులున్న వారికే టికెట్లు కేటాంచి, మిగితావారికి అన్యాయం చేస్తుందని, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో పలు పర్యాయాలు ప్రజాప్రతినిధులుగా కొనసాగిన గడ్డం ఫ్యామిలీ ఇంత వరకు ఒక్క పరిశ్రమ కూడా తీసుకొచ్చింది లేదన్నారు. ఇక్కడ గెలవడం.. ఇతర ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పడం వారికి అలవాటుగా మారిందని తెలిపారు. వీకెండ్ లీడర్ గడ్డం వంశీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కేంద్రం తెలంగాణకు చేసిందేమీలేదని, ఈ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎక్కువ సీట్లు గెలిస్తే పార్లమెంట్‌లో తెలంగాణ హక్కుల కోసం కొట్లాడే అవకాశముంటుందని, లేదంటే తెలంగాణ గురించి ఎవరూ మాట్లాడే పరిస్థితి ఉండదన్నారు. సింగరేణి కార్మికుడిగా.. మీలో ఒక్కడిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కొప్పుల ఈశ్వర్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మేరుగు పవన్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కౌన్సిలర్లు వంగ తిరుపతి, బేర సత్యనారాయణ, నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, గర్సె రామస్వామి, పానుగంటి సత్తయ్య, గుంట జగ్గయ్య, జనార్దన్, తిప్పని రామయ్య, కుర్మిల్ల మోహన్, గౌస్, చిట్యాల అశోక్ పాల్గొన్నారు.

మక్క దళారుల పాలు..

● కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని సర్కారు ● గత్యంతరం లేక వ్యాపారులకు అమ్ముకుంటున్న రైతులు

● ఇదే అదనుగా అందినకాడికి దండుకుంటున్నవైనం ● గతేడాది క్వింటాలుకు రూ. 2300..

● ఈసారి రూ. 1800 పలుకుతున్న ధర ● తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు

తాళ్లపేటలో దళారులకు అమ్మడానికి సిద్ధంగా ఉన్న మక్కలు

దండేపల్లి, ఏప్రిల్22 : ఎంతో కష్టపడి పండించిన మక్కను అమ్ముకునేందుకు రైతాంగం అష్టకష్టాలు పడుతున్నది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తుండగా, ఇదే అదనుగా భావించి వారు తక్కువ ధరకే కొంటూ జేబులు నింపుకుంటున్నారు. ఇక ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటకు సరైన ధర రాకపోవడంతో కర్షకలోకం కన్నీరుపెడుతున్నది..

15 వేల ఎకరాల్లో సాగు

యాసంగిలో జిల్లాలో ఎక్కువగా మక్క సాగు చేస్తుంటారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందవచ్చని మక్కువ చూపుతుంటారు. ఈ యేడాది 15 వేల ఎకరాల్లో పంట వేశారు. సాగు విస్తీర్ణం, దిగుబడి తగ్గడంతో ధరలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావించారు. కానీ పంట చేతికి రాగానే ధరలు పతనం కావడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు.

తగ్గిన దిగుబడి.. ధరలు

గతేడాది ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈసారి సాగునీటి కొరత, వాతావరణ పరిస్థితుల ప్రభావం, చీడపీడల బెడద, వన్యప్రాణుల దాడుల కారణంగా ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల లోపే దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. గత యేడాది బహిరంగా మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ. 2200 నుంచి రూ. 2300 వరకు ధర పలికింది. ఈసారి రూ. 1800 వరకే పలుకుతుంది. పంట పూర్తిగా చేతికొచ్చేసరికి ధర మరింత తగ్గే అవకాశముందని రైతులు అంటున్నారు. గతంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో బయటి వ్యాపారులు అధిక ధరకు కొనుగోలు చేశారు. ఈ సారి కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు అందినకాడికి దండుకుంటున్నారు.

తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుంది

మక్కలను ప్రభుత్వం కొనుగోలు చేస్తే మద్దతు ధర వచ్చేది. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు అమ్ముకుంటున్నం. గతంలో కొనుగోలు కేంద్రాలు ఉండడంతో మంచి ధర వచ్చింది. గతేడాది క్వింటాలుకు రూ. 2300 ధర పలికింది. ఇప్పుడు రూ. 1800 ఇస్తున్నరు. మస్తు నష్టపోతున్నం.

-గోపతి లక్ష్మయ్య, రైతు, తాళ్లపేట

ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఆలస్యం చేస్తున్నది. దీనినే ఆసరాగా చేసుకొని దళారులు మద్దతు ధర కంటే తక్కువకే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది.

వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న సీపీ, డీసీపీ, ఏసీపీ

మావోయిస్టుల సమాచారమిస్తే బహుమతి

● రామగుండం కమిషనర్ శ్రీనివాస్

● మావోయిస్టు చిత్రాల పోస్టర్ విడుదల

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 22 : మావోయిస్టుల సమాచారమిచ్చిన వారికి నగదు బహుమతి అందిస్తామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం కమిషనరేట్‌లోని తన కార్యాలయంలో మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావుతో కలిసి మావోయిస్టుల ఫొటోలతో ఉన్న వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు మావోయిస్టులకు సహకరించవద్దని, పోస్టర్‌లలో ఉన్నవారి గురించి తెలిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. లేకపోతే సీపీ రామగుండం : 08728 271333, డీసీపీ : 8712656503, ఎస్ఐబీ : 8712656596 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మావోయిస్టులు అజ్ఞాతాన్ని వీడి జన జీవన స్రవంతిలో కలిసి ప్రజాసమస్యలపై చట్ట బద్ధంగా పోరాడాలన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ప్రక్రియ

పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తామని సీపీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మంచిర్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గల స్ట్రాంగ్ రూమ్, డీఆర్‌సీ సెంటర్, హాజీపూర్ మండలం ముల్కల్లలోని కౌంటింగ్ సెంటర్లను కలెక్టర్ సంతోష్, డీసీపీ అశోక్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. అబ్జర్వర్స్‌కు ఈ నెల 25న సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. మంచిర్యాల ఆర్డీవో రాములు, ఏసీపీ ఆర్.ప్రకాశ్, సీఐ బన్సీలాల్, ఎస్ఐలు, మంచిర్యాల, నస్పూర్ ఎంఆర్‌వోల, సిబ్బంది పాల్గొన్నారు.